# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 11 జూన్ 1988 సంపుటి 8


## సంపాదకీయము

### లంచగొండితనమనే సమస్య

*( The Problem of Bribing )*

నేను ఈ మధ్య ఒకానొక ఆఫ్రికా దేశమును దర్శించితిని. అది దాని పొరుగునున్న దేశములకంటె ఎంతో అభివృద్ధి చెందియున్నది. అయినప్పటికి అక్కడ పోలీసువారికి వీధులగుండా, రోడ్లమీదుగా పోయే కార్లను, ఇతర వాహనములను ఆపడము వాటికి సబంధించిన పత్రాలను పరిశీలించడం వారి దినచర్యలో భాగమైయున్నది. అక్కడ డ్రైవర్లందరికి ఆ పోలీసువారికి కావలసినదేమిటో తెలియుట చేత వారికి లంచము చెల్లించి బైట పడతారు.

వారి దినచర్యలో మరొక భాగంగా యువ్వనస్తులను పట్టుకొని నిర్ణీత స్థలంలోకి తీసుకొనిపోయి ప్రశ్నించడము. అక్కడ కూడ ఎవరైతే లంచం చెల్లిస్తారో వారు మాత్రం విడుదల చేయబడతారు. లంచం చెల్లించనివారు లేదా చెల్లించలేని వారు మాత్రము అక్కడే

ఒక రోజంతా ఆహారం లేకుండా ఉండి ఆ స్థలాన్ని శుభ్రపరచడం లాంటి పనులుగాని లేదా వాస చేయమన్న మరేదన్నా పనిగాని చేయవలసి వుంటుంది.

అటువంటి పోలీసువారి గురించి ప్రజలయొక్క అభిప్రాయం ఎలాగ ఉంటుందో ఊహించండి? అటువంటి వారిని మోసగాండ్రుగాను, హాని కలిగించేవారుగాను పరిగణించి శత్రువులుగా భావిస్తారు. అదే పోలీసువారు గనుక చట్టాన్ని పరిరక్షించి, చట్టాన్ని ఉల్లంఘించని పౌరులను గౌరవించి వారికి సహాయపడినట్లైతే వారు ప్రజలచేత కొనియాడబడి గౌరవింపబడతారు.

అనేక పేద దేశాలలో అధికారము గలవారు పేదలను అనేక రకాలుగా హింసించి వారి జీవితాన్ని దుర్భరమైనదిగా చేస్తారు. అటువంటి దేశాలలో ఉద్యోగాల నిమిత్తం చెల్లించవలసి ఉంటుంది. కళాశాలలలో, విశ్వవిద్యాలయాలలో సీట్లను లంచమిచ్చి కొనుక్కోవలసి ఉంటుంది. వారికి సహాయపడే ప్రతీవారికి లంచం చెల్లించవలసి వస్తుంది.

లంచగొండితనమనే ఈ సమస్యను క్రైస్తవుడు ఏ విధముగా ఎదుర్కొనగలడు? అతడు లంచం చెల్లించునా, లేదా ఏమి చేయును? ఒకనికి లంచం ఇచ్చి చట్టాన్ని ఉల్లంఘించడానికి ప్రోత్సహించడం నేరం. మనము తప్పనిసరిగా చట్టానికి లోబడవలెనని పరిశుద్ధ గ్రంథము బోధించుచున్నది (రోమీయులు 13). మనము ఎవరికైనా లంచమిచ్చి చట్టాన్ని ఉల్లంఘించడానికి ప్రోత్సహించడంగాని లేదా చట్టానికి దొరకకుండా తప్పించుకొనటానికి సహాయపడడాన్ని నివారించవచ్చు. అయినప్పటికీ లంచగొండితనమనేది ప్రజల అవసరములను అవకాశముగా చేసుకొని వారినుంచి ఇంకనూ లబ్ది పొందగోరుచున్నది. దీనిని ఏవిధముగా ఎదుర్కొనగలము? పైన చెప్పిన విధ

ముగా చట్టాన్ని ఉల్లంఘించడానికి ఎవరినైనా మనం ప్రోత్సహించి నప్పటికి దానికి మన భాధ్యత ఎంత మాత్రము ఉండ కూడదు. అది ఒక టిప్పు రూపములోగాని, పనిచేసినందుకు కృతజ్ఞతగా ఇచ్చే సొమ్ము రూపంగాగాని ఉండినట్లయితే అది చట్టాన్ని ఉల్లంఘించడంగా కాకుండా మరొక రూపంలో ఉంటుంది.

ఈ లంచగొండితనమునకు పూర్తి బాధ్యత అధికారులదే అని నేను తలంచుచున్నాను. వారు దీనిలో భాగస్థులైనందున దీనిని నివారించలేకపోవుచున్నారు. లేదా తక్కువ జీతములు ఇచ్చుటద్వారా ఈ వ్యవస్థను కొనసాగించుటకు తోడ్పడుతున్నారు.

లంచగొండితనము అందరి మీదా తన ప్రభావాన్ని చూపిస్తున్నది. ధనికులు మాత్రము దానిని భరించగలిగి యున్నందున వారు లంచము చెల్లించి వారికి నచ్చిన విధముగా వారికి కావలసినది వారు పొందగలుగుచున్నారు. లంచగొండితనము ధనికులను మరీ ధనికులు గాను, బీదవారిని కడు బీదవారిగానూ చేస్తుంది. దీనివల్ల ఎక్కువగా నష్టపడేది బీదలే. చట్టంచేత ఎవరైతే సహాయం పొందుతూ, రక్షించ బడుతున్నారో వారు ఒకసారి చట్టంచేత బాధ పడినవారే. మరియు చట్టాన్ని శాసించే అధికారం కలవారు మాత్రం దానినుండి ఎంతో లబ్ధి పొందుచున్నారు.

ప్రజలు దీనినుండి ఎలా దూరముగా ఉండగలరు? అది పైనుండి జరుగవలెను అనగా అధికారులు లంచగొండితనాన్ని నిషేధించి దానికి పాల్పడు వారిని శిక్షించుట జరుగవలెను. కానీ ఈ లంచగొండితనము వల్ల ఎక్కువ మందికి మేలు చేకూరుటవల్ల ఆ పని ఎప్పుడోగాని జరుగుటకు అవకాశము లేదు. లేదా అది క్రిందనుండి జరుగవలెను. అనగా లంచమిచ్చుటను వ్యతిరేకించి అధికారులనుండి తమకు కావలసిన పనిని అడిగి జరిగించుకొనుట జరుగవలెను. కానీ ఇది సాధ్యపడే

విషయము కాదు. ఎందుచేతనంటే దీనిని తట్టుకోటానికి చాలామందికి శక్తి చాలదు.

అందుచేత ఈ సమస్యకు పరిష్కారం నీదగ్గర నాదగ్గర ఉన్నది. ఇప్పుడు మనం ఏమి చేద్దాం? ఈ లంచగొండి వ్యవస్థలో భాగస్థులై అది ఇంకా కొనసాగుటకు సహాయపడదామా లేదా మన స్నేహితుల తోనూ, కుటుంబీకులతోనూ చెప్పి వారిని ప్రోత్సహించి దీనిని అరికట్టు దామా-మనము మన క్రియలద్వారా దానిని అరికట్టలేకపోవచ్చును కానీ మనము చేస్తున్నది సరియైనదనియూ, చేయకూడని దానిని మనము ప్రోత్సహించడం లేదనియు గ్రహించినప్పుడు నిజముగా మనకు ఎంతో తృప్తి కలుగుతుంది.

---

## నీవు మనుష్య కుమారుని యందు విశ్వాసము కలిగి యున్నావా?

### *( Do you believe in the Son of Man ?)*

యోహాను సువార్త 9వ అధ్యాయములో యేసు పుట్టు గ్రుడ్డి వాడైన మనుష్యునికి స్వస్థత కలుగజేసినట్లు వ్రాయబడి యున్నది. ఆ మనుష్యుని పరిస్థితులు అతడిని భిక్షమెత్తుకునేలాగ దిగజార్చినప్ప టికి అతడు తన జ్ఞానమును తెలివితేటలను కోల్పోలేదు. స్వస్థతకు గల వేదాంతపరమైన ప్రాముఖ్యతను గుర్తించి దానిని విశ్వసించి అంగీకరించుటలో అతనికి గల జ్ఞానము ఆ రోజులలో మతాధికారు లైన పరిసయ్యుల జ్ఞానము కంటె గొప్పది. 35వ వచనములో పరిస య్యులు వానిని వెలివేసినారని యేసు విని వానిని కనుగొని నీవు మనుష్య కుమారుని యందు విశ్వాసముంచు చున్నావా? అని అడి గెను. అందుకు వాడు ప్రభువా నేను ఆయన యందు విశ్వాసముంచు

టకు ఆయన యెవడని అడుగగా, యేసు నీవాయనను చూచుచున్నావు నీతో మాట్లాడుచున్నది ఆయనే అనెను. అంతట వాడు ప్రభువా నేను నిన్ను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మొక్కెను.

గ్రుడ్డివాడు అవిశ్వాసానికి లోను కాకుండా యేసుని చూడగలిగాడు. గాని పరిసయ్యులు వారి స్వంత ఆలోచనలచొప్పున పొరపడి రక్షకుని గుర్తించుటలో గ్రుడ్డివారుగా నున్నారు. గ్రుడ్డివాని మాదిరిగా క్రీస్తుని చూచి ఆయన యందు విశ్వాసముంచుట మాని వారి ఊహాలకు సరిపడనటువంటి క్రీస్తును విశ్వసించలేక ఆయనను తృణీకరించి యున్నారు.

ఎందుకనగా గ్రుడ్డివాడు ఎటువంటి బేషరతులు లేకుండగ యేసుని విశ్వసించినందువల్ల రెండు అతి ముఖ్యమైన విషయాలను తెలుసుకొనగలిగాడు. మొదటిగా యేసుక్రీస్తును రక్షకుడిగాను దేవునిచే పంపబడ్డవానిగాను మానవులను పాపములనుండి రక్షించుటకు శక్తి కలిగిన వానిగాను గ్రహించాడు. రెండవదిగా అతడు తనను పాపిగా ఎంచుకొని తనకు అటువంటి రక్షకుడు అవసరమని గ్రహించాడు. ఈ రెండు విషయాలు అతడిని తన పాపములను తెలుసుకొనుటకు, దేవుని కుమారుడైన యేసును పాపములనుండి రక్షించగలిగిన శక్తికల వానిగా అంగీకరించుటకు సహాయ పడినవి.

ఆ విషయములో యేసుక్రీస్తును గూర్చి తెలుసుకొన్న ప్రతి వానికి ఆ గ్రుడ్డివాడు మాదిరిగా నున్నాడు. అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా 3:23). మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధకునిగా చేయువారమగుదుము. మరియు ఆయన వాక్యము మనలో ఉండదు (1 యోహాను 1:10). పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 5:12, 6:23, 13:1-2). భౌతిక సంబంధ

మైన లేదా దేహ సంబంధమైన మరణము తరువాత కూడా జీవించి యుండునది ఆత్మ (మత్తయి 10:28; హెబ్రీ 9:27). దేవుడు ప్రతి మనుష్యుని ఆత్మకు వారు భూమిమీద జీవించినపుడు చేసిన క్రియలను బట్టి తీర్పు తీర్చును (యోహాను 12 : 48, 1 పేతురు 1 : 17, లూకా 23:41, రోమా 2:6).

నీవు క్రీస్తును అంగీకరించకుండా మరణించినట్లయితే నీ ఆత్మ నిత్యనరకాగ్నిలో పడవేయబడును (1 థెస్స 1 : 6-10, మత్తయి 13 : 41-42, ప్రకటన 20:14-15; 21:8). కానీ క్రీస్తు మన ఆత్మలను నిత్యనాశనమునకులోను కాకుండా రక్షించును. దేవునియందు విధేయత చూపువారికి పరలోక రాజ్యములో ఆయన తనతో పాటు ఆశ్రయాన్ని కలిగిస్తానని వాగ్దానము చేసియున్నాడు (యోహాను 14:1-3, 1 థెస్స 4:17).

యేసుక్రీస్తు ఒక్కడే మనలను పాపములనుండి రక్షించును (రోమా 3 : 24, యోహాను 3 : 16-17, రోమా 5 : 8-9). మనము కేవలము యేసుక్రీస్తుద్వారా మాత్రమే మన పాపములనుండి రక్షింపబడతాము. గాని యిది మరెవ్వరివల్ల సాధ్యపడదు. యేసు యోహాను 14:6లో తానే స్వయముగా ఈ విధముగా చెప్పెను: "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి దగ్గరకు రాలేడని చెప్పెను."

ఒక్కసారి కనుక మన పాప జీవితమును గుర్తుచేసుకొనేట్లయితే మనము దేవుని కుమారుని అంగీకరించుట గాని తృణీకరించుటగాని చేయుటకు నిశ్చయించు కొనవచ్చును. గ్రుడ్డివాని మాదిరిగా మనము కూడా క్రీస్తును మన రక్షకునిగా అంగీకరించుదుము. లేదా పరిసయ్యులు మాదిరిగా ఆయనను తృణీకరించి, ఇంకనూ పాపజీవితములోనే ఉందుము. ఒకడు క్రీస్తుని అంగీకరించడం ఎలా సాధ్యపడును?

ఒకడు నిత్యజీవమును విశ్వసించి క్రైస్తవుడు కాగోరిన యెడల ముందుగా అతడేమిచేయవలెను? మొదటిగా యేసుక్రీస్తును అంగీకరించుటకు ఆయన మాత్రమే మన రక్షకుడిగాను దేవునిచే పంపబడిన వానిగాను నమ్మి విశ్వాసముంచవలెను (యోహాను 8:42; 1యోహాను 4 : 14). ఆ సత్యాన్ని నీవు హృదయ పూర్వకముగా నమ్మవలెను (యోహాను 8 : 24, యోహాను 11 : 25-26). తరువాత నీవు నీ పాప జీవితమునుండి మరలి, దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినందుకు నిజముగా దుఃఖపడవలెను. ఇటువంటి దుఃఖమును దేవుడు పశ్చాత్తాపముగా పరిగణించుచున్నాడు (2 కొరి 7:10). కాని పశ్చాత్తాపము ఒక్కటే సరిపోదు.

యోహాను 9వ అధ్యాయములో గుడ్డివాడు యేసును విశ్వసించి అంగీకరించినట్లు నీవుకూడా ఆయనయందు విశ్వాసముంచి అంగీకరించవలెను. ఇతర అధ్యాయములు కూడా ఒకడు రక్షణపొందుటకు యేసుక్రీస్తుని అంగీకరించవలెనని బోధించుచున్నవి (1 యోహాను 4:15, రోమా 10 : 9). క్రీస్తుని అంగీకరించునపుడు నీవు నీ పాపముల నుండి రక్షింపబడడానికి ఆయన ఒక్కడే మార్గమని లోకానికి చాటి చెప్పవలెను. ఒకసారి నీవు క్రీస్తును అంగీకరించి నీ పాపములను ఒప్పుకొనినట్లయితే, పాప పరిహారార్థము కొరకు నీవు తప్పనిసరిగా నీట మునిగి బాప్తిస్మము పొందవలెను. క్షమాపణయను మాటకు దేవుడు నీ పాపములను పూర్తిగా విస్మరించెనని అర్థము. దేవుని దృష్టిలో నీ జీవితము స్వచ్ఛమైనదిగాను నీవు ఎప్పుడు పాపముచేసి ఎరుగనట్లుగాను ఉండును (మార్కు 16 : 16, కొలస్స 1:12-14, అపో.కా. 2:38, 8:16, 8:36, 9:18, 22:16, రోమా 6:3-6, 1 పేతురు 3 : 21). నీరు నిన్ను రక్షించదు గాని అది దేవుని రక్తానికి బదులుగా ఉండి నీ పాపములను కడిగివేయును (రోమా 5:9, ఎఫెస్సి 1:7, కొలస్స 1:14, హెబ్రీ 12:9-14, 1 యోహాను 1:7, ప్రకటన 1:5, 5:9).

నీవు ఒకసారి క్రైస్తవుడవైన తరువాత నీవు తప్పనిసరిగా క్రైస్తవ జీవితమును జీవించవలెను. కొలస్స 3 1-3 లో ఏమని వ్రాయబడినదంటే "మీరు క్రీస్తుతో కూడా లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటి మీదేగాని, భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టకుడి. ఏలయనగా మీరు మృతి పొందిరి మీ జీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది." తరువాత 1 యోహాను 1:7లో ఏమని వ్రాయబడినదంటే "ఆయన వెలుగులో నున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము, అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతీ పాపములనుండి మనలను పవిత్రులుగా చేయును". నీవు పరిశుద్ధ గ్రంథములో దేవుని వాక్యము ఏ విధముగా బోధించుచున్నదో ఆ ప్రకారముగా జీవించుట జరుగవలెను. క్రైస్తవ సహోదరులతో దేవుని ఆరాధించుటకు నీకు యిది మంచి అవకాశము. ఒకవేళ నిజమైన క్రైస్తవ సహోదరులు ఎక్కడ ఆయనను ఆరాధించుటకు కూడుకొనుచున్నారో నీకు తెలియకపోయి నట్లయితే వెంటనే ఈ పత్రికకు వ్రాసినట్లయితే మేము మీరు ఎక్కడ కలుసుకొనవలెనో, ఎక్కడ ఆయనను యితర క్రైస్తవ సహోదరులతో ఆరాధించవలెనో తెలియజేస్తాము.

ఒక్కడైనను నశించిపోవడం దేవునికి యిష్టము కాదు. అందరూ నిత్యజీవములోనికి రావలెనని ఆయన కోరుచున్నాడు (2 పేతురు 3:9). అందుచేత ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును మన పాపముల నిమిత్తము బలిగా అర్పించి యున్నాడు. యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించుట లేదా తృణీకరించుట అనే విషయము ప్రతి మనుష్యునికి అతని అభీష్టమునకే వదిలివేయబడినది.

—ఫిలిప్ విల్కర్సన్.

# నిజమయిన ఆనవాలు

## ( *A true token* )

## రాహాబు – విశ్వాసము – విధేయత

రాహాబను వేశ్య విషయము కొద్దిగానైనను, క్రైస్తవులలో ఎరుగని వారుండరు. హెబ్రీ పత్రిక 11వ అధ్యాయము మనం పదే పదే చదువు అధ్యాయమే. అందు గల విశ్వాస వీరుల విషయం కూడ ఎరుగనిది కాదు. ఈ పదకొండవ అధ్యాయం మనకు అనేక విషయములు తెలియజేయు చున్నది.

రాహాబను వేశ్య విశ్వాసము విధేయత చూపించుట ద్వారా మనకు ఎంతయో యోగ్యమైన విషయములను చూపించుచున్నది. ఆమెను గూర్చిన చరిత్ర ముందుగా యెహోషువా గ్రంథములో చూడ గలము. యెహోషువా వేగులవారిని యెరికోకు పంపించెను. వారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపక పోయెను (హెబ్రీ 11:31). ఆమె విశ్వాసము దేవుని గూర్చి వినినందున కలిగెను. ఆ విశ్వాసమును ఆమె ఒప్పుకొన్నది (యెహోషువా 2:9-12). ఆమె చేసిన ఒప్పుకోలు శ్రేష్టమయినది. ఆమె విశ్వాసము విధేయతకు నడిపించెను. వేగులవారు ఆమెతో ఏమి చేయమని చెప్పిరో (యెహోషువా 2:18) ఆలాగుననే ఆమె చేసెను. అందు వలన వారు ఎరికోను జయించినప్పుడు వారు చెప్పినట్లుగా ఎర్రని దారాలను కట్టిన కిటికీ గల యింటివారినే రక్షించెను (యెహోషువా 6:22-23). విధేయతను బట్టి తానే గాక, తన యింటివారిని రక్షించెను.

### ఇందు మరికొన్ని విషయములు గమనించగలము

1) ఆ ప్రాకారముపై అనేకుల యిళ్లు వున్ననూ... అందరూ ఆ వేగులవారిని చేర్చుకొనలేదు. నేడు లోకములో అనేకులు నశిం

చిన వారున్ననూ.. అందరూ యేసు వర్తమానము చేర్చుకొనుట లేదు, సువార్తికులను చేర్చుకొనుట లేదు.

2) ఆమె ఒప్పుకొనినప్పుడు ఎవరి నాయకత్వంలో ఇశ్రాయేలీయులకు ఆ గొప్ప కార్యములు జరిగెనో ఆ నాయకులకు కలిగిన విశ్వాసమును ఒప్పుకోలేదు గాని వెనుకనున్న హస్తము అనగా దేవుని గూర్చి ఆమె విశ్వాసము కలిగి యున్నది. నేడు కూడా మన విశ్వాసము మనుష్యుల జ్ఞానముపై ఆధారపడనీయకూడదు గాని దేవుని శక్తిని (సువార్తను) ఆధారము చేసికొని యుండాలి (1 కొరింథీ 2:4, 5; రోమా 1:16).

3) ఆ యింటిలో అనగా ఎర్రని దారముకట్టిన కిటికీ కలిగిన ఇంటిలో ఉన్నవారు మాత్రమే వాగ్దానము కొరకు రక్షింపబడిరి. నేడు అనేక సంఘములనబడినవి యున్ననూ కొత్తనిబంధన ఏ సంఘము యొక్క గురుతును చూపించుచున్నదో అందున్న వారికే రక్షణ (యెహోషువా 2:19, ఎఫెసీ 5:30).

4) మరియు విధేయతను బట్టి వారిని రక్షించెను. వేగులవారు చెప్పినట్లుగా రాహాబు చేయని యెడల ఆమె, ఆమె యింటివారు కూడా నశించి యుండెడివారు. నేడు విశ్వాసము కలిగియుండియు విధేయతతో వాక్యము చెప్పిన రీతిగా చేయని వారు రక్షింపబడలేరు. అంతేకాదు.

5) అనేకులు ఆ పట్టణములో యున్ననూ, ఈమె మాత్రమే దేవుని యొక్క శక్తిని గ్రహించినట్లు ఒప్పుకొనెను.

ఇంకనూ ఆలోచించిన యెడల అనేక ఆత్మ సంబంధమైన, ఆసక్తిదాయకమయిన, మనకు భక్తిదాయకమయిన విషయములు దొరకును.

చివరిగా.. ఆమె కోరిక : నేను ఉపకారము చేసితిని గనుక, నా యింటివారికి ఉపకారము చేయుము (యెహోషువా 2:11). నిజమైన ఆనవాలు (a true token) ఇచ్చి...

ఈ నాడు నిజమైన ఆనవాలు (a true token) ఇవ్వనివారు అనేకులున్నారు. నీవు రక్షణ పొందాలంటే నిజమైన ఆనవాలు క్రొత్త నిబంధనలో యున్నది.

నీవు ఏ సంఘంలో యుండాలో నిజమైన ఆనవాలు, నీ ఆరాధన సత్యముగా ఆరాధించాలంటే క్రొత్త నిబంధనలో ఉన్నది. నిజమైన ఆనవాలు క్రొత్త నిబంధనలో యున్నది. ఇంకనూ, నీ భక్తికి, నీ నిత్య జీవమునకు నిజమైన ఆనవాలు క్రొత్త నిబంధనలో యున్నవి. అందువలన గ్రంథమును జాగ్రత్తగా పఠించుము. అవే నీకు నిజమైన ఆనవాలు (New testament is a true token for me, for you and us).

—సామ్యూల్ రాజు, యం.
బిక్కవోలు.

---

## అపొస్తలుల పని

### (*The work of the Apostles*)

అపొస్తలుల యేర్పాటును గూర్చి వారి విధులను గూర్చి గతంలో కొంత నేర్చుకొని యున్నాము. ఈరోజు వారిని గూర్చి మరికొంత తెలిసికొందము.

క్రీస్తు వారితో, యున్నప్పుడు అపొస్తలులకు గొప్ప శక్తి అధికారము ఇయ్యబడునని సూచించెను. పేతురుతో యేసు ఇట్లనెను: "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు

భూలోకమందు దేనిని బంధించుదువో అది పరలోకమందును బంధింప బడును, భూలోకమందు దేనిని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" (మత్తయి 16:19). దీనిని బట్టి ఈ శక్తి లేక అధికారము పేతురుకు మాత్రమే ఇయ్యబడెనని మనము తలంచరాదు. మొట్ట మొదటి సువార్త ప్రసంగమును యూదులకు, అన్యజనులకు ప్రసంగించే తరుణము పేతురుకే ఇయ్యబడినను, ఈ ప్రత్యేక శక్తిని క్రీస్తు మిగిలిన అపొస్తలుల కందరికీ యిచ్చెను. క్రీస్తు శిష్యులు తాము కూడియున్న యింటి తలుపులు మూసికొని యుండగా పునరుత్థానుడైన క్రీస్తు వారి మధ్యకు వచ్చి, "మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచి యుండనిత్తురో అవి నిలిచి యుండునని వారితో చెప్పెను" (యోహాను 20:23).

పరలోక రాజ్యపు తాళపు చెవులు మీ కిచ్చెదననుటలో, పరలోక రాజ్యములో అధికారమును ఆయన వారి కిచ్చెను. ఒక నిజమైన వార్త వాహుడు క్రీస్తుచే ఏర్పరచుకొనబడి పంపబడిన యెడల అతడు యేసు యొక్క వర్తమానమును అందించును. అందువలన యేసు తన శిష్యులతో, "మీ మాట వినువాడు నా మాట వినును, మిమ్మును నిరాకరించువాడు నన్ను నిరాకరించును, నన్ను నిరాకరించువాడు నన్ను పంపిన వానిని నిరాకరించుననెను" (లూకా 10:16). అపొస్తలులకు గొప్ప శక్తి ఈయబడెను నిజమే, గాని వారు దానిని వినియోగించుటకు తగిన రీతిగా సిద్ధపరచబడిన తరువాత మాత్రమే వారికా శక్తి ఈయబడెను.

యేసుయొక్క అపొస్తలులు మొదటి నుండి ఆయనతో యుండిరి. మొదట శిష్యులు గాను తరువాత అపొస్తలులు గాను వారు ఏర్పరచుకొనబడిరి. ఆయన ఈ లోకములో బహిరంగ పరిచర్య చేసి

నంత కాలము వా రాయనతో కలసి యుండిరి. ఆయన వారికి బోధించెను, ఉపదేశించెను, తగు శిక్షణ నిచ్చెను. ఆయన వారి కనేక సంగతులను గూర్చి పరలోక రాజ్యపు మర్మములను గూర్చి బోధించెను. వారు ప్రార్థించుట యెట్లో కూడ ఆయన వారికి నేర్పించెను (మత్తయి 6.5-15).

వారు యేసు దగ్గర పొందిన శిక్షణ కొద్ది కాలమే అయినను వారి కప్పగింపబడిన పనిని సాధించుట కది సరిపోదు. వారి జ్ఞాపకశక్తి సంకుచితమైనది. అందువలన వారు బహుశ మరచిపోవచ్చును. వారి కున్న ఈ మానవ బలహీనతను జయించు నిమిత్తము యేసు వారికి ఒక ఆదరణకర్తను వాగ్దానము చేసెను: ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతు లన్నిటిని మీకు జ్ఞాపకము చేయును". "ఆయన, అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 14:26; 16:13).

మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యని యేసు అపొస్తలులకు చెప్పినను, వారు పరిశుద్ధాత్మను, ఆయనయొక్క అద్భుత శక్తిని పైనుండి పొందేవరకు తమ సర్వలోక కృషిని ఆరంభించలేదు. ఇందు విషయమై యేసు వారికిట్లు బోధించెను: "క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనులలో ఆయన పేరట మారుమనస్సును పాప క్షమాపణయు ప్రకటింప బడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి

పొందు వరకు పట్టణములో నిలిచి యుండుడని వారితో చెప్పెను" (లూకా 24:47-49). వారు నిలిచి యుండవలసిన పట్టణము యెరూషలేము. మరల "ఆయన వారిని కలిసికొని యీలాగు ఆజ్ఞాపించెను - మీరు యెరూషలేము నుండి వెళ్ళక నా వలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి...కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను" (అపో.కా. 1:4, 5).

అపొస్తలులు యెరూషలేములో యుండిరి. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు, మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని" ఆయన వారితో చెప్పెను (అపో.కా. 1:8).

కొన్ని దినముల తరువాత పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అది యెరూషలేము. "అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింప బడినట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కని మీద వాలెగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్య భాషలతో మాటలాడ సాగిరి" (అపో.కా. 2:1-4).

అపొస్తలు లప్పుడు ప్రభువు నిర్ణయించిన స్థలములో యుండిరి వారు పని ఆరంభించే సమయము ఆసన్నమయినది. యేసు వాగ్దానము చేసినట్లు వారు పరిశుద్ధాత్మను పొందిరి. తద్వారా శక్తిపొంది దిరి. జనసమూహములు వారి యొద్దకు రాగా పేతురు వారికి మొట్ట మొదటి సారిగ క్రీస్తు సువార్తను బోధించెను. యేసే దేవుని కుమారుడనియు, జగద్రక్షకుడనియు అతడు వారికి నిరూ

పించెను. అతని మాటలను విని విశ్వసించినవారు సహోదరులారా, మేమేమి చేతుము? అని పేతురును మిగిలిన అపొస్తలులను అడిగిరి. అందుకు పేతురు "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను. "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:38, 41). పేతురు ఆనాడు ఏషరతులను విధించెనో పాప విముక్తి కొరకు అవే షరతులు నేటికిని నిలిచి యున్నవి.

నీవు నీ పాపముల నుండి రక్షణ పొందగోరుచున్నావా? అయితే క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాప క్షమాపణ కొరకు బాప్తిస్మము పొందుము. ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చుకొని దీవించును. నీవు సువార్తకు లోబడ గోరుచున్నావా?

—జాషువా గూటం.

---

# దేవుని మహోన్నత గ్రంధము

## (*God's Great Book*)

బైబిలు అని పిలువబడే దేవుని మహోన్నత గ్రంధమునుగూర్చి ఒక్కసారి పరిశీలించుదాము. బైబిలు అను పదమునకు "గ్రంధము" అని అర్ధము. ఈ పదము దాని గొప్పదనమును, ప్రాముఖ్యతను తెలియజేయు చున్నది. బైబిలు అనునది ఒక గ్రంధము... గ్రంధములకే గ్రంధము, లోకమునందున్న మిగిలిన గ్రంధములతో బైబిలును పోల్చి చూసినపుడు అది మానవాళికి ఎక్కువగా సహాయపడు గ్రంధముగా కనబడుచున్నది. అది పేదవారికి ఒక విధిగానూ, రోగులకు

స్వస్థత నిచ్చునదిగానూ, ఆకలిగొన్న వారికి ఆహారము నిచ్చునదిగానూ తప్పిపోయిన వారికి దారి చూపునదిగానూ, మరణించుచున్న వారికి 'నిరీక్షణ' కల్పించునదిగానూ కనబడుచున్నది. అది క్రైస్తవ మతానికి మూలకారణమై యున్నది.

ఈ మహోన్నత గ్రంథము నిజానికి బైబిలు అని గాని, పరిశుద్ధ గ్రంథమని గాని పిలువబడలేదు. మానవుడే దానికి ఆ పేరును కల్పించినాడు. ఈ గ్రంథము దానికదే "దేవుని వాక్యముగా" చెప్పబడుచున్నది (హెబ్రీ 4:12). 'లేఖనములుగ చెప్పబడుచున్నది' (యోహాను 5:39). 'దైవోక్తులుగా' చెప్పబడుచున్నది (1 పేతురు 4:11). ఇతర గ్రంథములతో దీనిని పోల్చి చూసినపుడు చాలా భిన్నమైన గ్రంథముగా కనబడును. ఇది దేవుని వాక్యమై యున్నది. ఇది పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడి వ్రాయబడినది. కొందరు వ్రాస్తూ, తాము పరిశుద్ధాత్మ చేత నడుపబడి, ప్రేరేపింపబడినట్లుగ చెబుతారు. అందుచేత మనము నిజమైన దేవుని వాక్యమును పొంది యున్నాము. "దైవజనుడు సన్నద్ధుడై, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17).

నిజానికి బైబిలు ఒక గొప్ప గ్రంథాలయము. అది కేవలము ఒక గ్రంథము మాత్రము కాదు గానీ అది 66 గ్రంథముల సంపుటి. అది 1600 సంవత్సరముల కాలములో 40 మంది విభిన్న గ్రంథకర్తల చేత వ్రాయబడినది. బైబిలు ముఖ్యముగ "పాత నిబంధన" "క్రొత్త నిబంధన" అను రెండు భాగములుగ విభజింపబడినది. పాత నిబంధనలో 39 గ్రంథములు, క్రొత్త నిబంధనలో 27 గ్రంథములు ఉన్నవి. పాత నిబంధనలోని మొదటి 5 గ్రంథములు . ఆదికాండము, నిర్గమ కాండము,

లేవీ కాండము, సంఖ్యా కాండము, ద్వితీయోపదేశ కాండము అనునవి న్యాయ శాస్త్రానికి చెందిన గ్రంథములు. యివి మోషే చేత ప్రేరే పింపబడి వ్రాయబడినవి. యెహోషువ, న్యాయాధిపతులు రూతు, సమూయేలు మొదటి గ్రంథము. సమూయేలు రెండవ గ్రంథము, రాజులు మొదటి గ్రంథము, రాజులు రెండవ గ్రంథము, దిన వృత్తాం తములు మొదటి గ్రంథము, దినవృత్తాంతములు రెండవ గ్రంథము. ఎజ్రా, నెహెమ్యా, మరియు ఎస్తేరు అనునవి చరిత్రకు చెందిన గ్రంథ ములు. ఇది వాగ్దాన భూమికి చేరుకున్న తరువాత జరిగిన ఇశ్రాయేలీ యుల సంతతికి చెందిన చరిత్ర. యోబు గ్రంథము, కీర్తనల గ్రంథము, సామెతలు, ప్రసంగి, పరమ గీతము అనునవి కావ్య సంబంధమైన గ్రంథములు. ఇంక పాత నిబంధన యందు మిగిలియున్న గ్రంథము లన్నియూ, ప్రవచనములే. ఈ గ్రంథములలో యెషయా నుండి, మలాకీ వరకు మనము క్రీస్తు రాకడ గురించి, ఆయన రాజ్యస్థాపన గురించి అనేక ప్రవచనములను చూస్తాము.

క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు గ్రంథములు, మత్తయి, మార్కు, లూకా, యోహాను, క్రీస్తు జీవితాన్ని వివరి స్తాయి. ఈ గ్రంథములు వ్రాయుటకు గల కారణమును యోహాను 20:30, 31 లో చదివి తెలుసుకొనవచ్చును. "మరియు అనేక యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారు డైన క్రీస్తు అని మీరు నమ్మునట్లుగను, నమ్మి ఆయన నామమున జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను." వీటి తరువాత అపొస్తలుల కార్యములు అనునది చరిత్రకు చెందిన గ్రంథము. ఇది క్రీస్తు శకము మొదటి శతాబ్దములో జరిగినటువంటి దేవుని సంఘము యొక్క స్థాప నను గూర్చియూ, దాని అభివృద్ధిని గూర్చియు తెలియజేస్తుంది. ఇది నిజముగ మనము చదువ వలసిన ఆసక్తికరమైన గ్రంథము. దీనిలో

"మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" అనిన యేసు యొక్క ఆజ్ఞకు లోబడి, అపొస్తలులు జరిగించిన క్రియలను తెలిసికొనవచ్చును. దీని తరువాత మనము 21 పత్రికలను చూడగలము. యివి అన్నియు క్రైస్తవులకు వ్రాయబడినవి. వీటిలో కొన్ని వ్యక్తుల నుద్దేశించి వ్రాయబడినవి. మరికొన్ని సంఘముల నుద్దేశించి వ్రాయబడినవి. వీటిలో 14 పత్రికలను అపొస్తలుడైన పౌలు వ్రాసెను. యాకోబు ఒకటి, పేతురు రెండు, యోహాను మూడు, యూదా ఒకటి వ్రాసెను. క్రైస్తవ జీవితము ఏ విధముగ జీవించవలెనో తెలియజేయుట కొరకు యివి వ్రాయబడెను. ఒక అపొస్తలుల కార్యములనబడె గ్రంథము పాపి రక్షింపబడటానికి ఏమి చేయవలెనో తెలియజేస్తుంది. కాని రక్షణ జీవితాన్ని ఎలా కాపాడుకొన వలెనో తెలియజేయడానికి 21 యితర గ్రంథములు గలవు. చివరిగా ప్రకటనలనబడిన గ్రంథము. క్రొత్త నిబంధనలో ప్రవచనములు కల్గిన ఒకే ఒక్క గ్రంథము యిది. ఈ గ్రంథములో చాలా మట్టుకు ప్రత్యేకమైన రీతులు వ్రాయబడినది. ఒక సంకేతము మాదిరిగా కనబడుతుంది. సాతాను, అతని సహచరులపై క్రీస్తు మరియు ఆయన సంఘము యొక్క అంతిమ విజయాన్ని తెలియజేస్తు శ్రమల కాలములో మనకు స్ఫూర్తినిచ్చే ఒక సందేశము వలె ఈ గ్రంథము కనబడుచున్నది. అదే విధముగ పరలోక రాజ్యము ఎంత సుందరమైనదో, మన కళ్ళకు కట్టినట్లు ఈ గ్రంథము చూపుతుంది.

బైబిలు మన జీవితములో వెల కట్టలేనంత గొప్ప ఆస్థియై యున్నది. మనము దానిని చదువునపుడు శ్రద్ధతోనూ, ప్రార్థన పూర్వకముగాను, నమ్మకమైన హృదయముతోనూ చదువుదము.

—రాయ్ బీస్లే.

# 25 సంవత్సరముల తరువాత యేమిటి ?

**( *After 25 Years, What Then ?* )**

( గత సంచిక తరువాయి )

ACU లెక్చర్ షిప్‌కు ఈ మధ్య నేను హాజరయ్యాను. ఒకప్పుడు విదేశాలలో 700 మంది మిషనరీలుండేవారని, ఇప్పుడు 400 మాత్రమే యున్నారని చెప్పబడింది. అయినను క్రొత్త నిబంధన క్రైస్తవ్యాన్ని చాటించే బోధకులు ఇప్పుడు ఎక్కువ యున్నారు. మునుపెన్నటికంటె సువార్తకు విధేయులయ్యేవారు ఇప్పుడు ఎక్కువ యుంటారు. వారిలో ఎక్కువ మంది శ్వేత జాతీయులు కారు. పరిశుద్ధాత్ముడు యెషయా ద్వారా ఇట్లు పలుకుచున్నాడు : "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిర పరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్య జనులు దానిలోనికి వచ్చెదరు" (యెషయా 2 : 2). దేవుని మందిరమే క్రీస్తు సంఘము (1 తిమోతి 3 : 15). ఈ ఒక్క సంఘముద్వారానే దేవుని యొక్క నానా విధములైన జ్ఞానము బయలు పరచబడవలెను (ఎఫెసీ 3 : 10-11).

భారతదేశంలో క్రీస్తు సంఘ మున్నది. అమెరికాలోను కెనడాలోను యున్న సంఘము వలెనే దానికిని బాధ్యత యున్నది. మేము పేదవారమని చెప్పి భారతదేశపు క్రీస్తు సంఘము తన బాధ్యతను తప్పించుకొన జాలదు.

నా బాల్యదశ అంతా పేదతనంలోనే గడిచిపోయింది. మేము బీదవారి మధ్య జీవించాము. అమెరికాలోని సంఘము విషయముకూడ యిది సత్యమే. మీకు డబ్బు లేకపోతే డబ్బు లేకుండగానే మీరు కాలం గడుపుదురని నేను ఇండియాలోని సహోదరులకు అనేక సార్లు

చెబుతాను. ఆదిమ సంఘ లక్షణములలో ఒకటి సహవాసము (అపొ. కా. 2 : 42). సహవాసము లేకపోతే మనకు పాప క్షమాపణ లేదు (1 యోహాను 1 : 7). ఇండియాలో నేను హాజరైన ప్రతి ఆరాధన కూటములోను చందా ఎత్తేవారు. బోధకుడు కూడా చందా వేయడా? అయితే అతడు సహవాసము కలిగి యున్నాడు. ఇచ్చుటలో తమ కున్న బాధ్యతను క్రొత్తనిబంధన సంఘము గుర్తించినది (ఫిలిప్పీ 4:15). మాసిదోనియ వారు నిరుపేదలైనను కానుక లిచ్చుటకు వారు ఆసక్తి కలిగి యుండిరి.

దేవు డెన్నడు అబద్ధ మాడజాలడు. "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును" (2 కొరింథీ 9 : 6). ఆత్మల యొక్క విస్తారమైన పంట విదేశాలలో యున్నదని గత 25 సంవత్సరములు నిరూపించినవి. సర్వలోకానికి సువార్త అందాలన్నది యేసుక్రీస్తు కార్యక్రమములో ప్రథమ అంశము (మత్త 28 : 19). దాని కేంద్ర బిందువు ఎక్కడ వుండునో ఆయనే చెప్పాడు: "ఇంక నాలుగు నెలలైన తరువాత కోత కాలము వచ్చునని మీరు చెప్పుదురు గదా, ఇదిగో మీరు కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చి యున్నవని మీతో చెప్పుచున్నాను" (యోహాను 4 : 35). ఈ లోక పాపముల కొరకు యేసు చనిపోయాడు. కోత కొరకు ఆ వర్తమానాన్ని సంఘము చాటించాలి.

భారత దేశానికి అమెరికా సోదర సోదరీలు 125 మంది వెళ్ళి వచ్చారు. అనేక స్థానిక సంఘాలు వారి పనిలో సహవాసము కలిగి యున్నాయి. బోధించుము, ఉపదేశించుము, ఆరాధించుము అనే ఆజ్ఞలు అన్ని దేశాలలో యున్న క్రైస్తవులకు వర్తిస్తాయి. కొందరు సహోదరులు ఇంగ్లాండు, స్కాట్‌లాండు నుండి వచ్చి బర్మాలోను, ఉత్తర భారతదేశంలోను మొదట పనిని ప్రారంభించారు. వారు వెళ్ళి

పోగా, ఆ పని విఫల మయ్యింది. బొంబాయి, పూనా ఏరియాలో కూడ మొదటి ప్రపంచ యుద్ధ సమయమందు పని ప్రారంభించబడింది. అనేకులు వాక్యాన్ని విన్నారు. అక్కడకు వెళ్లిన మిషనెరీలు విఫల మైనా, స్థానికులు ఆ పనిని కొనసాగించవలసింది.

గత కొన్ని సంవత్సరాలుగా సహో. స్కాట్ గారు భారత దేశం వచ్చుట నిషేధించబడింది. ఆయనను ఆపినవారే మిగతా వారిని కూడ రాకుండ ఆపివేయ వచ్చును. గాని దేవుడు తన పని జరిగే లాగున వేరే మార్గాలు తెరుస్తాడు.

మనము యిచ్చుట ద్వారానే గాని పుచ్చుకొనుట ద్వారా పరలోకానికి చేరుకోము. మనము ఆయన నామమున గిన్నెడు మంచి నీళ్లు యిచ్చినా, దాని ఫలితమును పొందుదుమని యేసు చెప్పాడు. కొందరు రెండేసి ఉద్యోగాలు చేస్తారు, అట్లు వారు ఎక్కువ డబ్బును సంపాదిస్తారు. పౌలు ఇట్లు చెప్పాడు : "ఎవని వెండినైనను, బంగారమునైనను, వస్త్రములనైనను నేను ఆశింప లేదు. నా అవసరముల నిమిత్తమును నాతో ఉన్న వారి నిమిత్తమును ఈ నా చేతులు కష్టపడినవని మీకే తెలియును. మీరును ఈలాగున ప్రయాస పడి బలహీనులను సంరక్షింపవలెననియు - పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యము అని ప్రభువైన యేసు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసికొనవలెననియు అన్ని విషయములలో మీకు మాదిరి చూపితిని" (అపొ. కా. 20 : ౩౩-౩౫). మరల అతడిట్లనుచున్నాడు : "దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగల వానికి పంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెను" (ఎఫెసీ 4 : 28).

మనము ధర్మకార్యములను చేయవలెను (యాకోబు 1 : 27). యెరూషలేము సంఘములో ధర్మకార్యము లుండెను (అపొ.కా.

6 : 1). బోధించుట మాని ఆహారము పంచిపెట్టుట యుక్తము కాదని అపొస్తలులు చెప్పారు (అపొ.కా. 6 : 2). తూర్పుగోదావరి జిల్లాలో క్రీస్తు సంఘస్థులు పోషించే 12 అనాథ శరణాలయాలున్నాయని నీకు తెలుసా? బోధించుట మాని ఆహారము పంచిపెట్టుమని వీరడుగుట లేదా? ఈ సంగతులను గూర్చి ఆలోచించండి.

ఇండియాలోని పేదతనాన్ని మనం నిర్మూలించెదమా? పరలోకంలో ధనాన్ని కూర్చుకొందమా? ప్రభువు ఇట్లనుచున్నాడు : "ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి కుదిలించి దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో, ఆ కొలతతోనే మీకు మరల కొలువబడును" (లూకా 6 : 38). యిది పని చేయునని నేనెరుగుదును. నీ విశ్వాసము మేరకు అది పనిచేయును. పాతనిబంధనలో వ్రాయబడినది మనకు బుద్ధి కలుగునట్లు వ్రాయబడింది (1 కొరింథీ 10 : 11). పాతనిబంధనలో యిట్లు వ్రాయబడినది : "మానవుడు దేవుని యొద్ద దొంగిలునా? అయితే మీరు నా యొద్ద దొంగిలితిరి. దేని విషయములో మేము నీ యొద్ద దొంగిలితిమని మీరడుగుదురు. పదియవ భాగములను, ప్రతిష్టితార్పణలను ఇయ్యక దొంగిలితిరి. ఈ జనులందరు నా యొద్ద దొంగిలుచునే యున్నారు, మీరు శాపగ్రస్తులై యున్నారు. నా మందిరములో ఆహార ముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి; దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియైన యెహోవా సెలవిచ్చుచున్నాడు" (మలాకీ 3 : 8-10).

యేసుక్రీస్తులో మనము పిలువబడిన ఉన్నత పిలుపుతో గురియొద్దకు పరుగెత్తుదము గాక!

—జె.సి. బెయిలీ.

# విధి గుర్తింపు – నిర్వహణ

మహా జ్ఞాని అయిన సొలోమోను మహారాజు దేవుడు తనకు అనుగ్రహించిన జ్ఞానముచేత సూర్యుని క్రింద జరిగే సమస్తమును పరిశీలించి చెప్పిన మాట ఏమనగా—"ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలను అనుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12 : 13).

ప్రతి క్రైస్తవుడు తన విధిని గుర్తించి నిర్వహించాలి. అదేమనగా మొదట దేవునికి భయపడాలి తరువాత ఆయన కట్టడలను అనుసరించి నడుచుకోవాలి. దేవునికి ఎందుకు భయపడాలి? అనగా : "మనలో ప్రతివాడు తన్నుగురించి దేవునికి లెక్కయొప్పచెప్పవలెను" (రోమా 14 : 12). మరియు "తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలము ప్రతివాడు పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయ పీఠము యెదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింధి 5 : 10).

దేవునిచేత అంగీకరించబడే నిమిత్తము దేవునికి భయపడాలి (అపొ. 10:35). క్షేమముగా ఉండే నిమిత్తము దేవునికి భయపడాలి (ప్రసంగి 8:12). దేవుడు మనయందు ఆనందించే నిమిత్తము దేవునికి భయపడాలి (కీర్తనలు 147:11). దేవుడు దహించు అగ్ని గనుక దేవునికి భయపడాలి (హెబ్రీ 12:29). దేవునికి భయపడేవారు, దేవునికి ప్రీతికరమైన సేవ చేయాలి (హెబ్రీ 12:28).

ఆయన కట్టడలను అనుసరించి నడుచుకోవాలి:- దేవుని ఆజ్ఞలను గైకొనాలి అంటే మొదట దేవుని ప్రేమించాలి (యోహాను 14:23). ఒక ధర్మశాస్త్రోపదేశకుడు ఆయనను శోధించుచు, 'బోధకుడా ధర్మ

శాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని' అడిగెను. అందుకాయన - నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోనూ, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ (మత్తయి 22:37, 38). అని చెప్పెను. ఈ ముఖ్యమైన ఆజ్ఞయొక్క ప్రాముఖ్యతను ప్రతి క్రైస్తవుడు గుర్తించి, దేవుని ప్రేమించాలి. దేవుడు మనలను ఎంతో ప్రేమించి తన కుమారుని మన పాప ప్రాయశ్చిత్తము కొరకు బలిగా అర్పించెను. దీనివలన దేవుడు ప్రేమస్వరూపి యని తెలుసుకొనుచున్నాము. ఇంతగా దేవుడు మనలను ప్రేమించినందుకు మనము కూడా దేవుని ప్రేమించ బద్ధులమై యున్నాము. కావున మనము దేవుని ప్రేమించిన యెడల ఆయన ఆజ్ఞలను గైకొనవలెను (యోహాను 14:15). మనము ఆయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట (యోహాను 5:3).

దేవుని ఆజ్ఞలను గైకొనాలి అంటే చాలా కష్టము అని కొన్నిసార్లు మనము అనుకొంటాము. కాని "ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" అని 1 యోహాను 5:3 లో చెప్పబడినది. ఆయన ఆజ్ఞలు గైకొనుచు ఆయన దృష్టికి యిష్టమైనవి చేసినయెడల మనమేమి అడిగినను అవి మనకు అనుగ్రహింపబడును (1 యోహాను 3:22).

అందుచేత ప్రతి క్రైస్తవుడు దేవునియందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలను (ఆజ్ఞలను) అనుసరించుచు నడుచుచుండవలెను. ఇది మన విధి. ఈ విధిని గుర్తించి నిర్వహించడము ప్రతి ఒక్కరి బాధ్యత. కావున ప్రియ సహోదరుడా: క్రైస్తవులమై కూడా మనము అనేక మారులు దేవుని ఆజ్ఞలను నిర్లక్ష్యము చేసి ఉండవచ్చును. అయితే ఇక మీదట ఎన్నడును ఆయన ఆజ్ఞలు మీరమనియు ఎల్లప్పుడు వాటిని గైకొనాలి అని ఈ రోజే నిశ్చయించుకొనగలరు. దేవుని

ఉగ్రతకు గురి కాకముందే, ఇంకా సమయముండగనే మారుమనస్సు పొంది దేవునివైపు తిరగాలి. అప్పుడు దేవుడు మనకు చేసిన నిత్య జీవము అనే వాగ్దానము పొందగలము.

—వి.జె. బెన్‌సన్, షాద్‌నగర్.

## ఎవడైనను క్రీస్తునందున్న యెడల

అనేకులు మేము క్రీస్తునందున్నామని చెప్పుకొను చున్నారు. అయితే వారు నిజముగా క్రీస్తునందున్నారో లేదో, అట్టి వారికి క్రీస్తునందు ఏమి దొరుకునో పరిశీలిద్దాం :

1. ఒకడు క్రీస్తునందు ఎల్లుండగలడు ?

"పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందెదరు" (అపొ.కా. 2:38). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరు ఎరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి (రోమా 6:34). క్రీస్తులోనికి బాప్తిసము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతి 3:27).

2. క్రీస్తునందున్న యెడల ప్రతీ ఆశీర్వాదమునకు అర్హుడు :

దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది (ఎఫెసీ 1:7). కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచిత

ముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు (రోమా 3 24). ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగు చున్నది (కొల 1:14). నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను (ఫిలి 4:13). ఇక మీదట నా కొరకు నీతి కిరీట ముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారి కందరికిని అనుగ్రహించును (2 తిమో 4:8). మరణము వరకు నమ్మకముగా నుండుము. నేను నీకు జీవ కిరీట మిచ్చెదను (ప్రక 2:10). క్రీస్తునందు లేనివారికి ఈ ఆశీర్వాదములు దొరకవని వాక్యము తేట పరచుచున్నది.

—గోట్రు డేవిడ్ రాజు, వాలమర్రు.

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................................
..............................................
..............................................
..............................................